



ఓటరు జాబితా పరిశీలకురాలికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

ఫొటో ఓటరు జాబితా సవరణను సమర్థవంతంగా నిర్వహించాలి

● ప్రభుత్వ సంస్థలు, శాఖల ప్రత్యేక కార్యదర్శి భారతి

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 21: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఫిబ్రవరి 8వరకు చేపట్టనున్న ఫొటో ఓటరు జాబితా ప్రత్యేక నమోదు, సవరణ కార్యక్రమం-2024ను సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వ సంస్థలు, శాఖల ప్రత్యేక కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకురాలు భారతి లక్పతినాయక్ అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, ప్రతీ నియోజకవర్గానికి చెందిన ఐదుగురు బూత్ స్థాయి అధికారులు, ఇద్దరు బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆదిలాబాద్, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు రాహుల్‌రాజ్, బదావత్ సంతోష్, హేమంత్ బొర్కడే, ఆశిష్‌సంగ్వాన్, అదనపు కలెక్టర్లు బి.రాహుల్, సబావత్‌మోతిలాల్, దీపక్‌తివారి, దాసిరి వేణు, ఫైజన్ అహ్మద్‌లతో కలిసి హాజరయ్యారు.

● ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది

ఫొటో ఓటరు జాబితా పరిశీలకురాలు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలంటే ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం-2024లో భాగంగా 6, 7, 8 ఫారముల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని తెలిపారు. 18, 19సంవత్సరాలు వయస్సు ఉన్న ప్రతీఒక్కరు తమ వివరాలు ఓటరు జాబితాలో నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని, వయస్సు అర్హత గల దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు.

● 'జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు'

అనంతరం, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ ఫొటో ఓటరు జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతీఒక్కరు ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు బూత్ స్థాయి అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ద్వారా నియమించబడిన ప్రతినిధుల సమన్వయంతో జాబితా రూపకల్పనకు దృష్టి సారించామన్నారు. జిల్లాలో వయస్సు అర్హత గల ట్రాన్స్‌జెండర్లు, సెక్స్‌వర్కర్లు, దివ్యాంగులు ఓటు నమోదు చేసుకునేవిధంగా అవగాహన కల్పించామన్నారు. ఒక్క పోలింగ్ కేంద్రంలో 1500 మంది ఓటర్లకు మించకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఆదిలాబాద్ సెగ్మెంట్‌లో 290, బోథ్‌లో 302 పోలింగ్ కేంద్రాలలో 592 బూత్‌స్థాయి అధికారులను నియమించామని పేర్కొన్నారు. ఇందులో ఆర్డీవోలు, జిల్లా అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



వేతన.. వేతలు!

» జిల్లాలో వేతనాల కోసం ఎదురుచూస్తున్న సర్పంచులు
» గత ఏడు నెలలుగా తప్పని తిప్పలు
» ఈ నెలాఖరుతో ముగియనున్న సర్పంచుల పదవీ కాలం
» పెండింగ్ వేతనాలు, పనుల బిల్లులు ఇవ్వాలంటున్న గ్రామ సర్పంచులు
» జిల్లావ్యాప్తంగా మొత్తం 467 గ్రామ పంచాయతీలు

ఉట్నూర్, జనవరి 21: గ్రామాలకు ప్రథమ పౌరుడిగా ఎన్నికైన గ్రామ సర్పంచ్‌ల పదవీ కాలం ఈ నెలాఖరుతో గడుస్తున్నప్పటికీ.. వేతనాలు అందక సర్పంచులు ఎదురుచూపులు చూస్తున్నారు. ఉట్నూర్ మండలం తో పాటు జిల్లాలో 467 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతీ సర్పంచుకు ప్రభుత్వం గౌరవ వేతనం కింద నెలకు రూ.6500 ప్రకటించింది. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా సర్పంచుల పరిస్థితి మారిందని పలువురు గ్రామ పంచాయతీల సర్పంచులు వాపోతున్నారు. గత ఏడు నెలలుగా జిల్లాలోని సర్పంచులకు ప్రభుత్వం చెల్లించాల్సిన వేతనాలు రూ.2 కోట్ల 12లక్షల 48వేల పైచిలుకు రావాల్సి ఉంది. ఈ లెక్కన ఒక్కొక్క సర్పంచుకు సుమారుగా రూ.50వేల వరకు రావాల్సి ఉందని సర్పంచులు పేర్కొంటున్నారు. ఇదేకాకుండా ప్రభుత్వం గత కొన్ని నెలలుగా గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించక పోవడంతో.. పనులు చేసి ఆ బిల్లుల కోసం కూడా ఎదురుచూస్తున్నామని అంటున్నారు. గత ప్రభుత్వం హయాంలో వేతనాలతో పాటు నిధులు రాక ఇబ్బందులు పడ్డామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అయినా నిధులు వస్తాయని గంపెడు ఆశలతో ఎదురుచూస్తున్నారు. వేతనాలు వస్తాయని ఆశ





గత ప్రభుత్వ హయాంలో శ్యాంపూర్‌లో వేసిన సిమెంట్ రోడ్డు(ఫైల్)

పడుతున్నప్పటికీ తమ పదవీ కాలం గడిచిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వేతనాలతో పాటు పెండింగ్ నిధులు యుద్ధప్రాతిపదికన మంజూరు చేయాలని ఆయా గ్రామాల సర్పంచులు కోరుతున్నారు.

కేటాయింపు లేని నిధులు

గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు సకాలంలో విడుదల చేస్తున్నప్పటికీ.. ఏడాది కాలంగా రాష్ట్ర నిధులు విడుదలకాక సర్పంచులు ఆందోళన చెందుతున్నారు. 25 శాతం నిధులు పారిశుధ్యానికి, 25 శాతం నిధులు తాగునీటి అవసరాలకు, మిగతా 50 శాతం నిధులు ఇతర పనులకు కేటాయిస్తూ వస్తున్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వం కేటాయించ డంలో నిర్లక్ష్యం చేయడం వల్ల సర్పంచులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ బిల్లులు, మురికి కాలువల నిర్మాణం, అంతర్గత రోడ్ల నిర్మాణం, పారిశుధ్య కార్మికుల వేతనాలు, ట్రాక్టర్ల ఈఎంఐలు, చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలలో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్ల బిల్లులు విడుదలకాక పోతుండడంతో పనులు చేసిన సర్పంచులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పెండింగ్ బిల్లులు ఇవ్వాలని మొర

జిల్లాలోని ఆయా గ్రామాలలో స్థానిక సర్పంచుల వేతనాలతో పాటు వారు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే విడుదల చేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర నిధులు రాక అప్పులు చేశామని పలువురు సర్పంచులు వాపోతున్నారు. అంతేకాకుండా అప్పులు చేసి పన్నులు చెల్లించడంతో తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నట్లు ఆయా గ్రామాల సర్పంచులు పేర్కొంటున్నారు.



వేతనాల బడ్జెట్ మంజూరు చేయాలి

: భూమన్న, సర్పంచ్ దంతన్‌పల్లి

గత ప్రభుత్వం కొన్ని నెలలుగా సర్పంచుల వేతనాలు మంజూరు చేయలేదు. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం అయినా సర్పంచుల వేతనాలకు సంబంధించిన బడ్జెట్‌ను వెంటనే మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



సత్వరమే పెండింగ్ బిల్లులు చెల్లించాలి

: గుండాల మల్లికాశంకర్, సర్పంచ్, శ్యామ్‌పూర్

గత కొన్నేళ్లుగా గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు రాకపోవడంతో సర్పంచులుగా గ్రామాలలో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు ప్రభుత్వం మంజూరు చేయాలి. గ్రామీణ ప్రాంతాల ప్రజల అవసరాల కోసం చేపట్టిన పనుల తాలుకు బిల్లులు మంజూరు చేసి సర్పంచులను ఆర్థిక ఇబ్బందుల నుంచి కాపాడాలి.



త్వరలోనే సర్పంచులకు వేతనాలు

: మహేష్‌కుమార్, ఎంపీవో, ఉట్నూర్

జిల్లాలోని ఆయా గ్రామాల సర్పంచులు అందరికీ వేతనాలు త్వరలోనే వస్తాయి. గత కొన్ని నెలలుగా ఎన్నికల హడావుడి రావడంతో వేతనాల చెల్లింపులలో జాప్యం జరిగి ఉండవచ్చు.

సంక్షిప్త సమాచారం



ఐటీడీఏ పీవో చాహత్‌బాజ్‌పాయి

మెటర్నరీ సెలవుల్లోకి పీవో

ఉట్నూర్, జనవరి 21: ఉమ్మడి జిల్లాలోని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి చాహత్‌బాజ్‌పాయి ఆదివారం నుంచి మెటర్నరీ సెలవుల్లోకి వెళ్లారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ప్రాజెక్టు అధికారికి సెలవులు మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆమెను రిలీవ్ చేశారు. అదనపు బాధ్యతలు కేటాయిస్తూ ఎలాంటి ఉత్తర్వులు జారీ కాకపోవడంతో జిల్లా కలెక్టరే ఐటీడీఏ పీవోగా బాధ్యతలు నిర్వహిస్తారని తెలుస్తుంది.

రేపు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి

ఉట్నూర్, జనవరి 21: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ, సీతక్క మంగళవారం ఉట్నూర్‌కు వస్తున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు, అన్ని శాఖల అధికారులతో ఉట్నూర్ కొమురంభీం ప్రాంగణంలోని పీఎంఆర్‌సీ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తమ పూర్తి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని అన్నారు.

రేపు కోర్ కమిటీ సమావేశం

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 21: ఆదిలాబాద్ జిల్లా పార్లమెంటరీ కోర్ కమిటీ సమావేశం ఈ నెల 23న ఎస్టీయూ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం ఇన్‌చార్జీ పాయల శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో పార్లమెంట్ పరిధిలోని బీజేపీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యే, ఎంపీలు, కోర్ కమిటీ సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

ఆరుతడి పంటలపై శ్రద్ధ చూపాలి

తాంసి, జనవరి 21: ప్రస్తుతం రబీ పంటల సాగు ముమ్మరమైందని ఇందులో ఆరుతడి పంటల సాగుపై రైతులు ప్రత్యేక దృష్టిసారించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ కోరారు. దీనిలో భాగంగా ఆదివారం సాయంత్రం మండలంలోని గిరిగావ్, అట్నంగూడ, అంబుగౌ గ్రామాలలో ఆయన పర్యటించి పంటల విషయంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం రబీ సాగు విస్తీర్ణంలో రైతులు నిమగ్నమై ఉన్నందున ప్రతిరైతు తక్కువ నీటి సాంద్రత కలిగిన పంటలపై మొగ్గు చూపా లని ఆయన పేర్కొన్నారు. అధిక పెట్టుబడులు వెచ్చించకుండా వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు అధికారులు సూచించిన వివరాలను తెలుసుకుని పంటలను సాగు చేయాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించేలా తగిన చర్యలు తీసుకున్నప్పుడే మంచి ఫలితాలు ఉంటాయని ఈ విషయాన్ని ప్రతీ రైతు గమనించాలని సూచించారు.



మాట్లాడుతున్న ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు పటేల్



పూజలు చేస్తున్న ఆదివాసీ మహిళలు



కలశాన్ని తెల్లని వస్త్రంతో కడుతున్న మెస్రం వంశీయులు

పవిత్ర గంగాజలం కోసం మెస్రం వంశీయుల పయనం

● పురాతనమైన మురాడి ఆలయంలో ప్రత్యేక పూజలు ● ఫిబ్రవరి 9న నాగోబా దేవతకు మహాపూజలతో జాతర ప్రారంభం

ఇంద్రవెల్లి, జనవరి 21: రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా జాతర మహాపూజలకు కావాల్సిన గంగాజలం కోసం మెస్రం వంశీయులు ఆదివారం కాలినడకన బయల్దేరారు. ముందుగా కేస్లాపూర్‌లోని పురాతన ఆలయం(మురాడి)లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు పటేల్ అధ్యక్షతన సమావేశమై గంగాజలం కోసం వెళుతూ రూట్‌ను ఎంపిక చేశారు. ముందుగా గంగాజలం సేకరణ కలశాన్ని పూజా సామగ్రిని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా మురాడి ఆలయంలో భద్రపరిచిన గంగాజల కలశాన్ని కటోడ మెస్రం కోసేరావు బయటకు తీశారు. గంగాజలం కలశాన్ని పెట్టి ఆదివాసి పురుషులు, మహిళలు వేర్వేరుగా పూజలు



అక్కా, చెల్లెళ్లకు కానుకలు సమర్పిస్తున్న మెస్రం వంశీయులు

చేశారు. కలశాన్ని కటోడ మెస్రం కోసు వీపుపై తెల్లనివస్త్రంతో కట్టారు. కాలినడకన వెళుతున్న కటోడ కోసుతో పాటు 168మంది మెస్రం వంశీయులు గిరిజన సంప్రదాయ ప్రకారం మర్యాదపూర్వకంగా ఒకరికి మరొకరు కలుసుకున్నారు. అనంతరం కాలినడకన గంగాజలం కోసం బయలేరేముందు మెస్రం వంశీయులు అక్కా, చెల్లెళ్లకు కానుకలు సమర్పించారు. గ్రామం నుంచి పొలిమేర వరకు గ్రామస్థులతో పాటు మెస్రం వంశీయులు వారిని సంప్రదాయంగా సాగనంపారు.

● ఆయా గ్రామాల గుండా కాలినడకన

రాత్రి కేస్లాగూడలో బస, సోమవారం నార్నూర్ మండలంలోని నారల్‌కొండలో బస, 24న జైనూర్ మండలంలోని గౌర్రి, 25న లింగాపూర్ మండలంలోని గూంమ్నూర్, 26న జన్నారం మండలంలో ఇస్లాంపూర్, 27న దుస్తురాబాద్ మండలంలోని మల్లేపూర్, 28న జన్నారం మండలంలోని గోదావరి హస్తినమడుగు వద్దకు చేరుకుంటామని వివరించారు. అక్కడ గంగాపూజలు నిర్వహించి గంగాజలం సేకరిస్తామన్నారు. అదేరోజు తిరుగు ప్రయాణంలో ఉట్నూర్ మండలకేంద్రానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. 30న ఉట్నూర్ మండలం నుంచి ఇంద్రవెల్లి మండలంలోని దోడంద గ్రామానికి చేరుకుని 31, ఫిబ్రవరి 1నుంచి 4వరకు అక్కడే బస చేస్తారు. 5న దోడంద గ్రామం నుంచి బయలుదేరి ఇంద్రవెల్లిలోని ఇంద్రాయి ఆలయానికి చేరుకుని పూజలు చేస్తామని తెలిపారు. అదే రోజు సాయంత్రం కేస్లాపూర్‌లో ఉన్న వడమర (మర్రిచెట్టు) వద్దకు చేరుకుంటామని తెలిపారు. ఆ చెట్టు వద్ద మూడు రోజుల పాటు బస చేశాక ఫిబ్రవరి 9న ఆలయ సమీపంలోని గోవ్వాడ్‌కు చేరుకుంటామని, అదే రోజు రాత్రి నాగోబా ఆలయంలో మహాపూజలు చేసి జాతర ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయులు మెస్రం చిన్ను పటేల్, ప్రధాన్ మెస్రం దాదారావు, మెస్రం కోసేరావు, మెస్రం శేఖు, మెస్త్రం హన్మంత్‌రావు, మెస్రం వంశం ఉద్యోగుల సంఘం సభ్యులు మెస్రం మనోహర్, మెస్రం దేవ్‌రావు, మెస్రం తుకారం, మెస్రం నాగ్‌నాథ్, మెస్రం జంగు, తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధికి కృషి

● లక్కారంలో పాఠశాల భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, జనవరి 21: ఉమ్మడి జిల్లాలోని ఖానాపూర్ నియోజకవర్గంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మండలంలోని లక్కారం గ్రామంలో రూ.కోటీ 17లక్షలతో ఆదివారం 'మన ఊరు-మనబడి' కార్యక్రమంలో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవన సముదాయానికి ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక విద్యా సౌకర్యాలకు చెందిన పాఠశాల భవనాలకు ప్రారంభోత్సవాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు అవసరం ఉంటాయని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మన ఊరు మన బడి పథకం ద్వారా మిగిలి ఉన్న డబ్బులతో పాటు అదనపు నిధులు సమకూర్చి అదనపు గదుల నిర్మాణం కోసం కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ ఉపాధ్యాయులు పని చేసి ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలు ఎత్తి వేసిన ప్రాంతాలలో తిరిగి పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు సిలబస్ అయ్యేలా సబ్జెక్టులు లేని టీచర్ల స్థానంలో ఇతర టీచర్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు బోధించాలన్నారు. ఖాళీ ఉన్న సబ్జెక్టుల స్థానాలను భర్తీ చేయడానికి జిల్లా విద్యాశాఖ అధికారి నివేదికలు పంపించాలని కోరారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణిత మాట్లాడుతూ జిల్లాలో 548 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయని ప్రభుత్వం డీఎస్సీ ఏర్పాటు చేయాలని భావిస్తున్నందున ఉపాధ్యాయ నియమకాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. అలాగే జిల్లా విద్యాశాఖ కార్యాలయం సెక్టోరియల్ అధికారి నారాయణ మాట్లాడుతూ భవన ప్రారంభోత్సవం జరిగినందున విద్యార్థులకు కావాల్సిన డ్యూయల్ డెస్కులు, ఫర్నిచర్, డైనింగ్‌హాల్ ఫర్నిచర్ సైతం ఒక నెల రోజుల్లో చేరవేసేలా కృషి చేస్తామన్నారు. ఇందులో ఎంపీపీ పంద్రా జైవంత్‌రావు, సర్పంచ్ రాథోడ్‌జనార్థన్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షురాలు సంధ్య, పంచాయతీరాజ్, సూపరింటెండెంట్ ఇంజనీర్‌రాథోడ్ వెంకట్రావు, ఈఈ మహవీర్, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

మావల, జనవరి 21: రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. మావల ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ మండలానికి చెందిన చెహూరి అశోక్(44) కడదారపు దత్తుతో కలిసి మోటర్ సైకిల్‌పై ఆదివారం తెల్లవారుజామున మావలలోని ఓ ఫంక్షన్ హాల్‌కు వెళ్లారు. గ్రామానికి చెందిన ఒకరి పోచమ్మ ఫంక్షన్ కార్యానికి నిమిత్తం మేకను అప్పగించి తిరిగి వస్తున్నారు. రాంపూర్ బ్రిడ్జి వద్ద పనులు నడుస్తుండడంతో అక్కడ డ్రమ్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బైక్ డ్రమ్స్‌కు ఢీ కొట్టింది. దీంతో మోటార్ బైక్ నడుపుతున్న దత్తుకు తీవ్ర గాయాలు కాగా, వెనుక కూర్చున్న అశోక్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో పొచ్చెర గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.





విజేత జట్టుకు బహుమతులను అందజేస్తున్న మాజీ మంత్రి రామన్న

జాతీయ స్థాయిల్లో సత్తా చాటాలి : జోగు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 21: నిరంతర సాధనతో క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకుని రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటాలని మాజీ మంత్రి జోగు రామన్న ఆకాంక్షించారు. పట్టణంలోని డైట్ మైదానంలో నిర్వహిస్తున్న ఆదిలాబాద్ క్రికెట్ లీగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఫైనల్ మ్యాచ్ జాహ్నవి, లెవెన్ స్టార్ జట్ల మధ్య పోటి జరుగగా ఎలెవన్ స్టార్‌జట్టు విజయం సాధించి టోర్నిని కైవసం చేసుకుంది.అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేత జట్టుతో పాటు రన్నరప్‌కు మాజీ మంత్రి జోగురామన్న బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ గత పన్నెండు సంవత్సరా లుగా జరుగుతున్న ఆదిలాబాద్ క్రికెట్ లీగ్ పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటుతున్నారని అన్నారు. క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇలాంటి టోర్నమెంట్‌లు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. ఇందులో బీఆర్ఎస్ నాయకులు సాజిదొద్దిన్, విజ్జగిరి నారాయణ, మాజీ మార్కెట్ మెట్టు ప్రహ్లాద్, ప్రశాంత్, అయ్యుబ్, తదితరులున్నారు.

'గురుకులాల్లో సమస్యలను పరిష్కరించాలి'

ఇచ్చోడ, జనవరి 21: బీసీ గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీసీ గురుకులాల రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి తిరుపతికి ఎమ్మార్పీఎస్ నాయకులు విన్నవించారు. జిల్లా పర్యటనలో భాగంగా డిప్యూటీ కార్యదర్శి తిరుపతి ఆదివారం ఇచ్చోడకు రావడంతో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. సరిపడా భవనాలు లేక, అద్దె భవనాల్లో ఇరుకిరుకు గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని కోరారు. కలిసిన వారిలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్, కార్యదర్శి సాయి, నాయకులు సురేష్, రవి చిట్టి, శ్రీకాంత్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



















ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	ఏషియన్ వైష్ణవి - ఆర్.సి.పురం
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	సినీ ప్లానెట్ - కొంపల్లి
ఆర్.కె. - బంజారాహిల్స్	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఏషియన్ రాధిక - కాప్రా
గలేరియా - పంజాగుట్ట	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఐకాన్ - హైటెక్‌సిటీ	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి	మిరాజ్ సినిమాస్ - చందానగర్
ఆట్రియమ్ - గచ్చిబౌలి	లక్ష్మీనరసింహ - మియాపూర్
ఎస్2 నోము - మల్లాపూర్	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎం.పి మాల్ - కాచిగూడ	మూవీటైమ్ - అమీర్‌పేట
జిఎస్ఎమ్ - మదీనగూడ	ఎస్.ఎల్.ఎస్ - గచ్చిబౌలి
నెక్లెస్ సత్య - కవాడిగూడ	టివోలి - సికింద్రాబాద్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	షా షహెన్‌షా - చింతల్
మంత్రామాల్- అత్తాపూర్	లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్
సుధా - శాలిబండ	మూవీమ్యాక్స్ - మౌలాలి
	జె.పి.సినిమాస్ - చందానగర్

ఆదిలాబాద్ జిల్లా అంతటా రామమయం

● ఇచ్చోడ మండలం బాబుల్‌డోలో పట్టువస్త్రాల సమర్పణ ● పలు మండలాల్లో అయోధ్య నుంచి బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం ● పలుచోట్ల అన్నదానాన్ని ఏర్పాట్లు

ఇచ్చోడ, జనవరి21: సోమవారం అయోధ్యలో జరిగే బాల రాముడి ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో ఇచ్చోడ మండలంలోని బాబుల్‌డో వద్ద గల గోశాల రామాలయంలోని సీతారాములకు పట్టువస్త్రాలు అక్షింతలను సమర్పించేందుకు ఆదివారం రెడ్డికాలనీలో సర్వం సిద్ధం చేసుకున్నారు. ఇచ్చోడలోని రెడ్డికాలనీకి చెందిన మహిళలు ఐదు రోజుల పాటు ఉపవాస దీక్షలను స్వీకరించి స్వామివారి సేవలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రెడ్డికాలనీ నుంచి రాములోరికి ప్రత్యేకంగా పట్టువస్త్రాలతో పాటు అక్షింతలను సిద్దం చేసి స్వామివారికి సమర్పించనున్నారు. మండల కేంద్రం నుంచి దాదాపు 200 మంది మహిళలు మంగళహారతులతో ర్యాలీగా ఆలయానికి చేరుకుని ప్రత్యేకపూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ఇచ్చోడ రామాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.


బాబుల్‌డోలో రాములోరికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు అక్షితలను తయారుచేస్తున్న రెడ్డి కాలనీ మహిళలు


ఆదిలాబాద్ పట్టణంలో ఇంటింటికీ దీపాలు, జెండాలను పంపిణీ చేస్తున్న నాయకులు

● ఆలయాన్ని శుద్ధి చేసిన యువకులు

భీంపూర్: మండలంలోని వాడర్ గ్రామంలో బీజేపీ యూత్ మోర్చ మండల అధ్యక్షుడు గడ్డం ప్రవీణ్ రెడ్డి యువకులతో కలిసి హనుమాన్ ఆలయాన్ని శుద్ధి చేశారు. అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయాన్ని శుద్ధి చేయడం జరిగిందన్నారు.

● ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు

బోథ్: బోథ్ మండలకేంద్రంలోని దుర్గ కమిటీలో సోమవారం అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పట్టణ ప్రజలు చూసేందుకు గాను మెగా స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ సభ్యులు పేరొన్నారు. ఉదయం 9గంటల నుంచి దుర్గ కమిటీలు సరస్వతి శిశుమందిర్ విద్యార్థుల ఆధ్వర్యంలో సాంస్కృత కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదేవిధంగా సాయంత్రం వేళ నాలుగు గంటల నుంచి శ్రీరాముడు, హనుమంతుడి విగ్రహాలతో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గాను హిందూ బంధువులు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

● సోనాల రామాలయంలో ప్రత్యేక పూజలు

సోనాల మండల కేంద్రంలో రామాలయంలో అయోధ్య రాముల వారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ జీవీ రమణ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం రామాలయాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాములోరి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామస్తులు చూసేందుకు గాను ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంతేగాక ఉదయం పూట ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు. భక్తులు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గాను తరలిరావాలని కోరారు.

● కోట(బి) చాలీసా పారాయణం

బోథ్: మండలంలోని కౌటా(బి) గ్రామంలో ఆదివారం హనుమాన్ మందిరంలో హనుమాన్ చాలీసా కార్యక్రమాన్ని చేపట్టారు. అదేవిధంగా గత ఐదు రోజులుగా శబరిమాత ఆలయంలో నిరంతర శ్రీరామ నామ స్మరణ కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఆయా గ్రామాలలో అన్నదాన కార్యక్రమాలను చేపడుతున్నారు.

● నేడు మండలవ్యాప్తంగా అన్నదానం

బజార్‌హత్నూర్: మండలం పరిధిలోన్ని అన్ని దేవాలయాలను ఆయా గ్రామస్థులు సుందరంగా విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. అయోధ్య నగరంలో నిర్మించిన రామాలయంలో నేడు రామ్‌లల్లాను ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని అన్ని దేవాలయాలలో అన్నదాన కార్యక్రమాలను, ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. అలాగే, మండలకేంద్రంలోని ఎస్‌వీ పాఠశాలలో అయోధ్యా నగరంలో నిర్మించిన రామాలయంలో రామ్ లల్లాను ప్రాణప్రతిష్ఠ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సంబురాలను జరుపుకున్నారు. విద్యార్థులు ప్రత్యేకంగా రాముడి పేరుతో రామ్ గాను, రాముడి ఆయుధమైన విల్లును ధనస్సు రూపంలో విద్యార్థులు కూర్చుని రాముడిపై వారికున్న భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నానక్ సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● అయోధ్యకు చేరుకున్న సైకిల్ యాత్రికులు

ఉట్నూర్: మండలంలోని లక్కారం పంచాయతీ పరిధిలోని వేణు నగర్‌కు చెందిన యువకులు సైకిల్‌యాత్ర ద్వారా అయోధ్యకు ఆదివారం రాత్రి చేరుకున్నారు. వెనునగర్‌కు చెందిన కాత్లె భీమేశ్వర్, జాదవ్‌రాజేశ్ అనే యువకులు శ్రీరాముడిపై ఉన్న భక్తితో గత డిసెంబర్ 29న అయోధ్యకి సైకిల్‌యాత్రతో బయలుదేరారు. ఇరువురు యువకులు విజయవంతంగా 22 రోజులు పూర్తి చేసుకుని అయోధ్యకు క్షేమంగా చేరుకున్నామని బంధువులకు సమాచారం అందించారు. అయోధ్యలో రాముడి జన్మభూమికి చేరుకోవడంతో పాటు సోమవారం జరుగనున్న కార్యక్రమాలకు హాజరు కావడం తమ అదృష్టం అని వారు వివరించారు.

కాగా, అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠాపన పురస్కరించుకుని వచ్చిన అక్షింతలను విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌కు అందించారు. ఆదివారం మండల కేంద్రంలో ఉన్న డీఎస్పీ నాగేందర్‌ను కలిసి సోమవారం ఉదయం నగర సంకీర్తన నిర్వహించి రామాలయంకు భజన చేస్తూ చేరుకుంటామని వివరించారు. ఎవరికి ఇబ్బంది లేకుండా సామరస్యంగా కార్యక్రమం నిర్వహించుకోవాలని ఆయన కోరారు. అనంతరం సీఐ రామకృష్ణ, ఎస్సై మనోహర్‌లకు అక్షింతలను అందజేశారు.

● ఇంటింటికీ రామ చరిత్ర పుస్తకాల పంపిణీ

ఆదిలాబాద్ అర్బన్: పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో బీజేపీ రాష్ట్ర నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరామ మందిరం పునర్ ప్రారంభం సందర్భంగా శ్రీరామమందిరం చరిత్ర పుస్తకాలను భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జాదవ్ రాజేష్‌బాబు ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేష్‌బాబు మాట్లాడుతూ అయోధ్య శ్రీరాముని మందిరం ప్రారంభం రోజున ఆదిలాబాద్ నియోజక వర్గ ప్రజలందరూ ప్రతీ ఇంట్లో ఐదు దీపాలను వెలిగించి దీపావళి జరుపుకోవాలని వారు పేర్కొన్నారు. ఇందులో బీజేపీ నాయకులు, కార్యకర్తలు శ్రీను, పవన్, గణేష్, శ్యామ్, ప్రకాష్, పప్పు, తదితరులు పాల్గొన్నారు.

26న హీరా సుక్క జయంతి వేడుకలు

మావల, జనవరి 21: ఫిబ్రవరి 26న ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నిర్వహించనున్న ఆదివాసీ పర్ధాన్ నిర్వహించనున్న ఆదివాసీ పర్ధాన్ సమాజ్ కుల గురువు హీరా సుక్క జయంతి వేడుకలు విజయవంతం చేసేందుకు అందరూ సమన్వయంతో ముందుకు వెళ్లాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ ఉద్యోగుల సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓల్డ్ అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అత్యవసర సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో ఆదివాసీ పర్ధాన్ సమాజ్ ఉద్యోగుల సంఘం సభ్యులు మనోహర్, శంకర్, ఆనంద్‌రావు, నగేష్, అనసూయ, పర్ధాన్ సమాజ్ నాయకులు, తదితరులు ఉన్నారు.

ఘనంగా సప్తాహ ముగింపు

తాంసి, జనవరి 21: గత ఏడు రోజుల నుంచి మండలంలోని వడ్డాది గ్రామంలో నిర్వహించిన బాజీరావు బాబా సప్త ఆదివారం సాయంత్రంతో ముగిసింది. జిల్లా నలుమూలల నుంచి కాకుండా పక్కన ఉన్న మహారాష్ట్ర నుంచి వందలాదిమంది బాజీరావు భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. ప్రత్యేక రథంలో ఏర్పాటు చేసిన బాజీరావు చిత్రపటాన్ని మేళ వాయిద్యాల నడుమ మహిళల నృత్యాలు, డప్పు చప్పుల నడుమ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు కోసం వివిధ పార్టీల ప్రజాప్రతినిధులతో పాటు పలు శాఖల అధికారులు పలువురు ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంతో గ్రామంలో సందడి కనిపించింది.

జంగుబాయి జాతర పోస్టర్ల ఆవిష్కరణ

ఉట్నూర్, జనవరి 21: ఉమ్మడి జిల్లాలోని కెరమెరి మండలం కోట పరండోలి బీడ్‌వార్ సరిహద్దులో ఉన్న ఆదివాసుల పుణ్యక్షేత్రం జంగుబాయి దేవస్థానం జాతర ఉచ్చావాలా పోస్టర్లను ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జుపటేల్ ఆవిష్కరించారు. ఆదివారం మండలంలోని లక్కారంలో జంగుబాయి దేవస్థాన కమిటీ సభ్యులు కలిసి జాతరకు రావాలని ఆహ్వానించారు. ఈనెల 25న మహాపూజ, ఫిబ్రవరి 8న ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, దేవస్థాన కమిటీ అధ్యక్షుడు కొడప రాజు, ప్రధాన కార్యదర్శి సలాంశ్యాంరావు, రైసిదాం జంగు, మరప బాజీరావు, మండాడి దౌలత్ రావు, మేస్రం చందు, తొడసం జనార్ధన్, తదితరులు ఉన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలకే పంపండి : ఎమ్మెల్యే రాంరావు పాటిల్


ఎల్వత్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంరావుపాటిల్

తానూర్, జనవరి 21 : మండలంలోని ఎల్వత్ గ్రామంలో రూ.19.90 లక్షలతో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని ముధోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పవార్ రాంరావుపాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడ పాఠశాలను మహాలక్ష్మీ ఆలయంలో నడుపుతూ విద్యాబోధన చేశారని, ఇప్పుడు నూతన భవనం ఏర్పాటు అయిందని, ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలని సూచించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేసే విధంగా చూస్తానన్నారు. ఈయన వెంట ఎంఈవో సుభాష్, సర్పంచ్ జ్యోతి, ఎంపీటీసీ సభ్యురాలు పుష్పభీంరాజ్, నాయకులు సురేష్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా నిర్వహించాలి

● ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి భారతి లక్‌పతి నాయక్





మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 21 : ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఫిబ్రవరి 8 వరకు చేపట్టనున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ-2024ను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ సంస్థలు, శాఖల ప్రత్యేక కార్యదర్శి బి. భారతి లక్‌పతి నాయక్ పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, రిటర్నింగ్, నియోజకవర్గ, బూత్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంచిర్యాల, ఆదిలాబాద్, కుమరంభీం-ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు బదావత్ సంతోష్, రాహుల్ రాజ్, హేమంత్ బోర్కడే, ఆశిశ్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు విలువైందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జాబితాలో సవరణ ఉంటే సరి చేసుకోవాలన్నారు. ఫారం నంబర్ 7, 8లు స్వీకరించి తప్పుల్లేని ఓటరు జాబితా సిద్ధం చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 2న అభ్యంతరాలను, ఫిర్యాదులను పరిష్కరించి 6వ తేదీన తుది జాబితా రూపొందించాలన్నారు. మంచిర్యాల కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ, జిల్లాలో అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో 287, చెన్నూర్, బెల్లంపల్లిల్లో 227 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి 741 మంది బూత్‌స్థాయి అధికారులను నియమించినట్లు చెప్పారు. మంచిర్యాల ఆర్‌డివో రాములు, చెన్నూర్ ప్రత్యేక సబ్ కలెక్టర్ సిడాం దత్తు, ఇతర అధికారులు పాల్గొన్నారు. స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీల పాత్ర కీలకమని ప్రభుత్వ సంస్థలు, శాఖల ప్రత్యేక కార్యదర్శి బి.భారతి లక్‌పతి నాయక్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంచిర్యాల, ఆదిలాబాద్, కుమరంభీం-ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు బదావత్ సంతోష్, రాహుల్ రాజ్, హేమంత్ బోర్కడే, ఆశిశ్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు బి. రాహుల్, దీపక్, ఫైజన్ అహ్మద్‌లతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. భారతి లక్‌పతి నాయక్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందని, అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. 22వ తేదీన ముసాయిదా జాబితాను రూపొందించి అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించాలన్నారు. పూర్తి వివరాలతో వచ్చే నెల 8వ తేదీన తుది జాబితా ప్రచురిస్తామని తెలిపారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1500 మంది వచ్చే విధంగా, ఒకే కుటుంబానికి చెందిన వారు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ద్వారా నియమితులైన ఏజెంట్లు బీఎల్‌ఓలకు సహకరించాలని కోరారు.

పెట్టుబడిదారి విధానానికి వ్యతిరేకంగా ఉద్యమం

లెనిన్ శత వర్ధంతి సభలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. అడివయ్య, జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ

నిర్మల్ టౌన్, జనవరి 21 : సామ్రాజ్యవాదం, మతోన్మాదం, పెట్టుబడి దారి విధానానికి వ్యతిరేకంగా ఉద్యమాలకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. అడివయ్య, జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి సభ సీపీఎం కార్యాలయం జరిగింది. లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచ మానవాళి విముక్తికి మహోన్నత సిద్ధాంతాన్ని మార్క్స్, ఏంగెల్స్‌లు అందిస్తే దాన్ని ముందుకు తీసుకెళ్లి అమలు చేసిన గొప్ప వ్యక్తి లెనిన్ అని అన్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటి సామ్యవాద కలను సాకారం చేసిన ఘనత లెనిన్‌కు దక్కుతుందన్నారు. ఆయన బతికింది యాభై నాలుగేళ్లు అయినా వందేళ్ల తర్వాత కూడా ఆయన అందించిన విప్లవ స్ఫూర్తి నేటికీ కొనసాగుతుందన్నారు. ప్రపంచంలోనే తొలి సోషలిస్టు వ్యవస్థ ఆవిర్భావం రష్యాలో లెనిన్ నాయకత్వంలో జరిగిందన్నారు. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలలో పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థలు సంక్షోభంలోకి పోతున్నాయన్నారు. మహిళలు, కార్మికులు, రైతాంగ సమస్యలను లోతుగా అధ్యయనం చేశారన్నారు. దేశంలో మతోన్మాద బీజేపీ ప్రజల మధ్య చీలికలు పెట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మి వేస్తుందన్నారు. రాజ్యాంగ లౌకిక విలువలను తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శంఖు, పట్టణ కార్యదర్శి ఫసిఉద్దీన్, నాయకులు పోశెట్టి, పట్టణ శాఖ కార్యదర్శులు నైతం భీమ్ రావు, షైక్ అతిక్, షైక్ షబ్బీర్, ముంతాజ్ బేగం, తదితరులు పాల్గొన్నారు.



లెనిన్ శత వర్ధంతిని నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష్మణచాందలో పర్యటించిన కూచాడి శ్రీహరి రావు

లక్ష్మణచాంద, జనవరి 21 : నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు ఆదివారం మండలంలో పర్యటించారు. మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అట్ల చిన్న రామ్ రెడ్డి అనారోగ్యానికి గురికాగా ఇటీవలే శస్త్రచికిత్స జరిగింది. ఈ విషయం తెలిసిన శ్రీహరిరావు ఆయనను పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్బడి ప్రతాప్ రెడ్డి, ఒడ్నాల రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, నగేష్, తదితరులున్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో వ్లాదిమిర్ లెనిన్ 100వ వర్ధంతి

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 21: కమ్యూనిస్టు యోధులు ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా కార్మిక వర్గ నియంతృత్వంతో రష్యాలో విప్లవాన్ని సాధించి కార్మిక వర్గ రాజ్యాన్ని స్థాపించిన వ్లాదిమిర్ లెనిన్ 100వ వర్ధంతి కార్యక్రమాన్ని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రష్యాలో కార్మికవర్గ నాయకత్వంలో విప్లవం సాధించడం ద్వారా దోపిడిలేని సమసమాజాన్ని లెనిన్ స్థాపించాడన్నారు. కార్మికులకు రైతాంగానికి మహిళలకు సర్వహక్కులు కల్పించారని, లెనిన్‌స్ఫూర్తితో భారతదేశంలోను దోపిడి పీడనలేని సమసమజం స్థాపించడం కోసం కార్మికులందరు పోరాడాలని పిలుపునిచ్చారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ల రద్దు కోసం పోరాటాలు నిర్వహించాలని, ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని కార్మికులందరికి కనీస వేతనాలు ఉద్యోగ భద్రత పెన్షన్ ఇన్సూరెన్స్‌పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాల కోసం పోరాడాలన్నారు. కార్మిక వర్గ హక్కుల సాధన కోసం పోరాటం చేయడమే లెనిన్‌కి మనం ఇచ్చే నివాళులని పేర్కొన్నారు. భారతదేశ కార్మిక వర్గం ప్రభుత్వాల ప్రజా కార్మిక కర్షక వ్యతిరేక విధానాలపై పోరాటం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జఆశన్న, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.సురేందర్, పందుగపోచన్న, అగ్గిమల్ల స్వామి, నాయకులు దశాంత్, దత్తు కిరణ్, వినీత్, తదితరులు పాల్గొన్నారు.

సీఆర్టీల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ, జనవరి 21: సీఆర్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గల బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బోథ్ నియోజక వర్గ తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లి సీఆర్టీలకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. ఇందులో సీఆర్టీల సంఘం సభ్యులుపాల్గొన్నారు.

ఉట్నూర్‌లో సంకల్ప యాత్ర

ఉట్నూర్, జనవరి 21: మండలకేంద్రంలో నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప యాత్రలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఆదివారం ఉట్నూర్ పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ ప్రజలకు పీఎం నరేంద్రమోదీ పథకాలను,అభివృద్ధినిడిజిటల్ వన్ ద్వారా వీక్షించేలా ప్రదర్శించారు. గ్రామ ప్రజలు కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి పేర్కొన్నారు.

వికసిత్ భారత్ కార్యక్రమం

తానూర్, జనవరి 21 : మండల కేంద్రం తానూర్‌తో పాటు మండలంలోని నంద్‌గావ్, జవుల(కే), ఉమ్రి గ్రామాలలో ఆదివారం వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బ్యాంకు అధికారులు ముద్ర రుణాలు, విశ్వకర్మ పథకం, పలు కేంద్ర పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఉజ్వల గ్యాస్ సిబ్బంది, హెల్త్‌వర్కర్స్, ఆరోగ్య సిబ్బందితో పాటు బీజేపీ ముధోల్ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, గణేష్, సాయినాథ్ నారాయణ్‌లు పాల్గొన్నారు.

ఉపాధి ఆడిట్ ఉత్తిదేనా!?



» కొనసాగుతున్న అక్రమాల పరంపర » రికవరీలపై నిండా నిర్లక్ష్యం » అక్రమార్కులపై చర్యలు కరువు » జిల్లాలో కోటి రూపాయలకు పైగా అవకతవకల నిర్ధారణ



నిర్మల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులలో పెద్దఎత్తున అవకతవకలు చోటుచేసుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత నాలుగు ఏళ్ల నుంచి జిల్లాలో ఉపాధి హామీ కింద చేపట్టిన వివిధ రకాల పనులలో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉపాధి హామీ సిబ్బంది చేతివాటంతో చేయని పనులను చేసినట్లు చూపించి ఉపాధి కూలీల వేతనాలను స్వాహా చేశారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఈ పథకం కింద చేపట్టిన పనులు, చెల్లింపులకు సంబంధించి నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్ ప్రక్రియపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సోషల్ ఆడిట్‌లో వెల్లడవుతున్న అక్రమాలపై అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుని చేతులు దులిపేస్తున్నారంటున్నారు. రికవరీలు అలాగే అవకతవకలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలు లాంటి వ్యవహారంలో అధికారులు ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం ఉపాధి హామీ పథకం అమలులో అనేక సాంకేతిక పరమైన మార్పులు, సంస్కరణలు చేపట్టి నిర్వహణ అంతా ఆన్‌లైన్‌లో పకడ్బందీగా కొనసాగిస్తున్నప్పటికీ అవకతవకలకు మాత్రం పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయలేకపోతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2016 నుండి జిల్లాలో దాదాపు కోటి రూపాయలకు పైగా అవకతవకలు జరిగినట్లు సోషల్ ఆడిట్ ద్వారా నిర్ధారణ అయ్యింది. అయితే ఇందులో నుంచి ఇప్పటి వరకు కేవలం 37 లక్షల 44 వేల రూపాయలు మాత్రమే రికవరీ అయినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. మరో 61 లక్షల 93 వేల రూపాయలను అవకతవకలకు పాల్పడిన సిబ్బంది నుంచి రికవరీ చేయాల్సి ఉంది. ఇంత పెద్దమొత్తంలో రికవరీ చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ పథకం కింద నర్సరీలను ఏర్పాటు చేయడం, మొక్కలు నాటడం, చెరువులు, కుంటలు, బావులలో పూడికతీత, వ్యవసాయ క్షేత్రాలను చదును చేయడం, వైకుంఠధామాలు, రైతువేదికలు, పంటకల్లాల నిర్మాణం పనులను సైతం చేపట్టారు. అయితే ఈ పనులలో కూలీలకు చెల్లించిన వేతనాలు అలాగే తదితర ఆర్థికపరమైన అంశాలపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. చాలా గ్రామాల్లో సోషల్‌ఆడిట్ ద్వారా పెద్దఎత్తున అవకతవకలు వెల్లడయ్యాయి. సంబంధిత క్షేత్ర స్థాయి సిబ్బంది ఈ పనులకు సంబంధించి అక్రమాలకు పాల్పడినట్లు సైతం నిర్ధారణ అయ్యింది. అయితే సోషల్ ఆడిట్‌లో పూర్తి వివరాలను వెల్లడించినప్పటికీ చర్యల విషయంలో మాత్రం అధికారులు వెనుకడుగు వేస్తున్నారు.

నిండా నిర్లక్ష్యం

ఉపాధి హామీ పథకం కింద జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న పనులలో పెద్దఎత్తున నిర్లక్ష్యంగా జరుగుతుందన్న ఆరోపణలున్నాయి. క్షేత్రస్థాయిలో సిబ్బంది కూలీల పనులు చేయకుండానే చేసినట్లు రికార్డుల్లో చూపుతున్నారని అంటున్నారు. దీనికి తోడు ఉపాధి హామీ కింద చేపడుతున్న పనులకు సంబంధించిన ప్రదేశాలలో ఎలాంటి సమాచారం అందుబాటులో ఉంచడం లేదని అలాగే ఖర్చులకు సంబంధించిన వివరాలు కూడా నమోదు చేయడం లేదంటున్నారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పకడ్బందీగా పర్యవేక్షించకపోతుండడం అలాగే కూలీలు చేపట్టే పనుల విషయంలో దృష్టి సారించకపోతుండడం, హాజరు విషయంలో కూడా పెద్ద దృష్టికి పెట్టకపోతుండడం లాంటి వ్యవహారాలు ఈ పథకం అమలులో అవినీతిని నిరోధించలేకపోతుండడానికి ఆస్కారమిస్తున్నాయంటున్నారు.

ప్రభావం చూపని సంస్కరణలు

కాగా ఉపాధి హామీ పథకం అమలులో అవినీతి జరుగుతున్నట్లు నిర్ధారించిన కేంద్రప్రభుత్వం సరికొత్త సాంకేతిక సంస్కరణలు తెరపైకి తెచ్చింది. పథకం అమలును మరింత పకడ్బందీగా చేపట్టి కూలీలందరికీ ఉపాధితో పాటు చెల్లింపులు జరపాలన్నదే ప్రధానలక్ష్యంగా పెట్టుకొని ఆన్‌లైన్ వ్యవహారాన్ని అమలు చేస్తున్నారు. కూలీల ఖాతాలన్నింటిని ఆధార్‌తో అనుసంధానం చేసి బినామీ కూలీలు తెరపైకి రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే ఉపాధి కూలీలు చేపడుతున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందు కోసం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్)ను అమలు చేస్తున్నారు. పని చేసే స్థలం నుండే కూలీలు తమ ఫోటోలు తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో తాము పనిచేసే చోటు నుండే ఫోటోలు దిగి వాటిని అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. దీని కారణంగా కూలీల సంఖ్యతో పాటు వారు చేస్తున్న పనుల విషయాలు ఎప్పటికప్పుడు సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఆన్‌లైన్ విధానంతో వెల్లడి కానున్నాయి. దీని కోసం గాను సాటిలైట్ సహకారాన్ని కూడా తీసుకుంటున్నారు. అయితే ఇంత పెద్ద ఎత్తున సాంకేతికతను ఉపయోగిస్తున్నప్పటికీ అవకతవకలను మాత్రం పూర్తిస్థాయిలో అడ్డుకోలేకపోతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పారదర్శకంగా ఉపాధి హామీ అమలు



ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులతో పాటు కూలీల విషయంలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నాము. సోషల్ ఆడిట్ ద్వారా నిర్ధారణ జరిగిన రికవరీల వసూలుకు చర్యలు తీసుకుంటున్నాం. కూలీలందరికీ పూర్తిస్థాయిలో పని కల్పించడమే కాకుండా వేతనాల చెల్లింపును పకడ్బందీగా చేపడుతున్నాం. ఎక్కడ కూడా తప్పులకు ఆస్కారం లేకుండా పర్యవేక్షణ జరుపుతున్నాం. నిరంతరం క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేపడతాం.

విజయలక్ష్మి, పీడీ, ఈజీఎస్, నిర్మల్ జిల్లా



అయోధ్య ప్రాణప్రతిష్ఠ వేడుకలను ఆదర్శంగా నిర్వహించుకోవాలి

● జిల్లా ఎస్పీ జానకీ షర్మిల



భైంసాలో అయోధ్య క్షేత్ర మహిషా ట్రస్టు ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

భైంసా, జనవరి 21 : ఆధ్యాత్మికత భావాలతో అయోధ్య ప్రాణప్రతిష్ఠ వేడుకలను ఆదర్శంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ జానకీ షర్మిల పిలుపునిచ్చారు. ఆదివారం భైంసాలో పర్యటించి వేడుకల బందోబస్తును సమీక్షించారు. ఈ సందర్భంగా అయోధ్య క్షేత్ర ట్రస్టు మహిషా ప్రతినిధులతో మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎలాంటి సమస్యలకు తావు లేకుండా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. అన్నివర్గాల వారు శాంతి, సంయమనాలతో వ్యవహరించుకుంటూ ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. ఎవరికి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేపట్టుకోవాలని పేర్కొన్నారు. వేడుకలు ప్రశాంత వాతావరణంలో కొనసాగేందుకు ప్రతి ఒక్కరు పోలీసుశాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ట్రస్టు ప్రతినిధులతో వేడుకల నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

● సమస్యాత్మక ప్రాంతాల పరిశీలన

పట్టణ పరిధిలోని సమస్మాత్మక, వివాదాస్పద ప్రాంతాలను జిల్లా ఎస్పీ జానకి షర్మిల పరిశీలించారు. అయోధ్య క్షేత్ర ట్రస్టు మహిషా ప్రతినిధులతో భేటి ముగిసిన అనంతరం ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, టౌన్ సీఐ రాజారెడ్డిలతో బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం పంజేషా చౌక్, జుల్పేకర్ గల్లి, పురాణాబజార్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించారు. గతంలో అల్లర్లు జరిగిన ప్రాంతాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల వాసులతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ (ఎఆర్) వెంకటేశ్వర్ ఉన్నారు.

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలి

ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ సభ్యులు రవీందర్ మహారాజ్



జిల్లా ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ

నిర్మల్ టౌన్, జనవరి 21 : భారత గణతంత్ర దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ ఘనంగా, పండుగలా నిర్వహించుకోవాలని ఆదివారం జిల్లా ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ సభ్యులు రామగిరి రవీందర్ మహారాజ్ పిలుపు నిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలతో పాటు అగ్రకులాల మహిళలు వేల సంవత్సరాలుగా సామాజికంగా మానవ హక్కులు లేకుండా జీవిస్తే, వారందరికీ బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగం ద్వారా విముక్తిని కలిగించారని గుర్తు చేశారు. ముందు కులవృత్తులే చేయడమే ధర్మం నుంచి నైపుణ్యానికి తగ్గట్టు ఏ వృత్తినైనా, ప్రతి ఒక్కరూ చదువుకునే అవకాశం కేవలం పవిత్రమైన భారత రాజ్యాంగ ఆశయమేనన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల కుటుంబాల్లో ప్రతి తల్లి దండ్రులు భారత రాజ్యాంగ విశిష్టతను సాంస్కృతిగా బోధించాలన్నారు. ఆగస్టు 15 భారత దేశంలోని భూమికి స్వాతంత్రం వచ్చిందని, జనవరి 26 1950న ఈ దేశ ప్రజలందరికీ గణతంత్రం పేరున స్వాతంత్రం వచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న అగ్రకుల పాలకులు స్వాతంత్ర దినోత్సవానికి, గణతంత్ర దినోత్సవానికి తేడా తెలవకుండా ఉండడం విడ్డూరమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రచార కమిటీ సభ్యులు రాజు మహారాజ్, కల్లూర్ సుధాకర్, సొన్న భూమేష్, కత్తి శేఖర్, ముత్యం మహారాజ్, బాబు బరిగెల పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

నిర్మల్ రూరల్, జనవరి 21 : సోన్ మండలం పాక్‌పట్ల గ్రామ మాజీ సర్పంచ్ తోట లింగన్న ఇటీవల చనిపోయారు. ఆదివారం లింగన్న కుమారుడు శ్రీనివాస్‌ను, వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి వి. సత్యనారాయణ గౌడ్ పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకొని ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఇదే గ్రామానికి చెందిన నల్ల నర్సవ్వ, తల్వేద ముత్యం ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట సర్పంచ్ గంగారెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ కన్వీనర్ మోహినుద్దీన్, నాయకులు ముత్యం రెడ్డి, రమేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నర్సారెడ్డి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

అంతా రామమయం

● వీధి వీధిన శోభాయాత్ర ● అన్ని ప్రాంతాల్లో శ్రీరామ నామ జపాలు ● అలంకరణలతో ఆలయాలకు నూతన శోభ ● ప్రాణ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారాల కోసం జోరుగా ఏర్పాట్లు



భైంసాలో శ్రీరాం అక్షరమాలలో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రదర్శన



మహిళల శోభాయాత్ర

భైంసా, జనవరి 21 : మరి కొన్ని గంటల్లో అయోధ్య నగరిలో జరుగనున్న ప్రాణ ప్రతిష్ఠ కోసం భైంసా డివిజన్ వాసులు అన్ని విధాలుగా సన్నద్ధమయ్యారు. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేపట్టుకున్నారు. ప్రాణ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు ఆలయాల ప్రాంగణాల్లో ఎల్ఈడీ, డీజిటల్ బోర్డులను సిద్ధం చేసారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళికల రూపకల్పన చేశారు.

● అంతటా రామ నామమే

రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా ఆదివారం శ్రీరామ నామస్మరణతో మార్మోగిపోయింది. ప్రధాన కాలనీల్లో వేకువ జాము నుంచి ప్రభాత్ బేరి , శోభ యాత్రలు కొనసాగాయి. పురుషులు శ్రీరాముని చిత్ర పటాలతో, మహిళలు మంగళహారతులతో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శోభయాత్ర, ప్రభాత్ బేరిల్లో శ్రీరామ కీర్తనలు, నామ స్మరణాలు ,హనుమాన్ చాలీసాల ఆలపానలు జరిగాయి. ఆలయాల్లో భజనలు జోరుగా కొనసాగాయి. అల్ఫోర్స్ పాఠశాలలో విద్యార్థులు శ్రీరామ అక్షర మాలగా ఏర్పడి ప్రదర్శనలు చేపట్టారు. శిశు మందిర్ విద్యా సంస్థల్లో విద్యార్థులు శ్రీరాములు, సీతాదేవి, లక్ష్మణుడు, అంజనేయుని వేషాధారణాలతో నిర్వహించిన ప్రదర్శనలు అందరని అలరారించాయి.

● ఆలయాలకు కొత్తశోభ

అయోధ్య నగరిలో జరుగనున్న ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని భైంసాలోని ఆలయాల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆయా కాలనీల్లో ఆలయాలను సంబంధిత కాలనీలవాసులు శోభయమానంగా అలంకరించారు. విద్యుత్ దీపలు, పూలతో ఆలయాలను అలంకరించడంతో కొత్త శోభను సంతరించుకున్నాయి.

● యాగాలు, అన్నదానాలు

సోమవారం పట్టణంలోని పలు ఆలయాల్లో యాగాలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరుగనున్నాయి. ఇందు కోసం గాను ఆయా ఆలయాల కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అనంతరం ప్రతి ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదానాలు చేపట్టనున్నారు.



పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న మహిళలు



అలంకరించిన ఆలయం

కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 21 : జిల్లాకేంద్రంలో తెలంగాణ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో రైతు సేవా సహకార సంఘం ఎఫ్ఎసీఎస్ నిర్మల్ మార్కెట్ యార్డ్‌లో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. రైతులకు కనీస మద్దతు ధర కలిగే విధంగా కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తుందని తెలిపారు. ప్రస్తుతం క్వింటాల్ కందుల ధర దాదాపు రూ. 9,000 ఉండగా, రానున్న రోజుల్లో మరింత విలువ పెరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకచొరవతో రైతులకు, హమాలీలకు మరింత లబ్ధి చేకూర్చే విధంగా వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వడ్ల కొనుగోలులో గాని, కందుల కొనుగోలులో గాని అధికారులు, వ్యవసాయ మార్కెట్ సిబ్బంది చేతివాటం చూపిస్తే సహించబోమని హెచ్చరించారు. తరుగు పేరుతో, వివిధ కారణాల పేరిట రైతులను మోసం చేసే వ్యక్తులపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజుకుమార్‌రెడ్డి, అయ్యన్నగారి భూమయ్య, ఒడిసెల అర్జున్, సాదం అరవింద్, భూపాల్‌రెడ్డి, భూపతిరెడ్డి, రమేష్, వీరేష్, చంద్రకాంత్, మార గంగారెడ్డి, జమాల్, జుట్టు దినేష్, విలాస్, తిరుమలచారి, కత్తి సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్, రైతులు, హమాలీలు, తదితరులు పాల్గొన్నారు.

చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నిర్మల్ అర్బన్, జనవరి 21 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని స్థానిక ఎమ్మెల్యే నివాసంలో చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం క్యాలెండర్‌ను ఆదివారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన సంఘ భవన నిర్మాణ సమస్యలను వివరించగా ఇట్టి సమస్యలపై ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వకుళాభరణం మధుసూదన్, డివిజన్ అధ్యక్షులు డాక్టర్ దాస్యం కృష్ణస్వామి, డివిజన్ గౌరవ అధ్యక్షులు తిరుక్కోవెల నారాయణస్వామి, డివిజన్ ప్రధాన కార్యదర్శి అనంతశయనం మనోహర్ స్వామి, జిల్లా కోశాధికారి ధర్మగడ్డ రఘునాథస్వామి, డివిజన్ కోశాధికారి తిరుక్కోవెల సుదర్శన్‌స్వామి, సంఘ బాధ్యులు ఆసూరి గిరిధర్‌స్వామి, వకుళాభరణం కృష్ణమూర్తి ధర్మగడ్డ డాక్టర్ రాఘవ స్వామి, వెంకటరమణ, కిషోర్, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

దిలావర్‌పూర్, జనవరి 21 : మండలంలోని బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. గుండంపెల్లి గ్రామానికి చెందిన నారాయణరెడ్డి అనే బీజేపీ కార్యకర్త ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు.

సంక్షిప్త సమాచారం

పద్యకవి వెంకట్‌కు జాతీయ శతాధిక సాహితీ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న పద్యకవి బి. వెంకట్

ముథోల్, జనవరి 21 : జిల్లా కేంద్రానికి చెందిన మల్లినాథసూరి కళాపీఠం సంస్థాన్ జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షులు బి.వెంకట్‌కు జాతీయ శతాధిక సాహితీ పురస్కారం దక్కింది. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ ప్రధానవేదికలో ఆదివారం పద్మశ్రీ అవార్డు గ్రహీత మొగులయ్య చేతుల మీదుగా జాతీయ కవి సమ్మేళన సాహితీ పురస్కారంను స్వీకరించారు. వెంకట్ సంస్కృత భాష వైభవాన్ని గేయ రూపంలో ఆలపించారు. తెలుగుభాష వ్యాకరణ వైభవంపై పాటను పాడారు. కళాకారులు, తదితరులు శుభాకాంక్షలు తెలిపి, అభినందించారు.

బైక్ మెకానిక్‌కు ఆర్థిక చేయూత

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 21 : పట్టణంలోని మోటార్ సైకిల్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తోటి మెకానిక్ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడున్న దృష్ట్యా ఆయన కుటుంబ సభ్యులకు రూ. 24,500ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గజ్జల మురళి, ప్రధాన కార్యదర్శి రాజేష్‌లు మాట్లాడుతూ.. మోటార్ సైకిల్ మెకానిక్ ఎండీ ముజీబ్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని తెలుసుకొని మానవతా దృక్పథంతో తోటి మెకానిక్‌కు చందాలు పోగుచేసి రూ. 24,500లను ఆదివారం బాధితుడి ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, మెకానిక్‌లు ఇసాక్ అహ్మద్, కోశాధికారి రమణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా..పట్టించుకోరు



లక్ష్మణచాంద, జనవరి 21 : మండల ప్రధాన రహదారి ప్రమాదాలకు నెలవుగా మారిందని, ఎందరో ప్రమాదానికి గురై ప్రాణాలు సహితం కోల్పోయినా పట్టించుకునేవారు లేరని పలువురు ప్రయాణికులు ఆదివారం తమ ఆవేదన వ్యక్తం చేశారు. పొట్టపెల్లి - లక్ష్మణచాంద గ్రామాల మధ్య ఈ బీటీ రోడ్డు మధ్యలో పెద్ద గుంత పడింది. ఇది చాలదన్నట్లు ఫైబర్ కేబుల్ లైన్ మరమ్మతుల కోసం తవ్విన గుంతలతో పాటు మొరం కుప్పలు నెలల తరబడి అలాగే ఉండటం వలన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఎప్పటికప్పుడు రోడ్డును పరిశీలించి మరమ్మతులు చేపట్టాల్సిన ఆర్ అండ్ బి అధికారుల అలసత్వం కారణంగా పలువురు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. వాహనాలకు వేలకు వేలు రోడ్‌టాక్స్‌లు కట్టి ప్రమాదాలకు గురికావలసిన దరిద్రపు పరిస్థితి ఎదురవుతుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి వెంట ప్రతీరోజు ప్రయాణిస్తున్న పలువురు ప్రజాప్రతినిధులు, మండల, జిల్లా స్థాయి అధికారులకు ఈ గుంతలు కనబడటం లేదా అని ప్రశ్నిస్తున్నారు.